# రాష్ట్రస్థాయిలో పతకాల పంట

- అథ్లెటిక్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన పౌర్ణమి
- హర్షం వ్యక్తం చేస్తున్న జడ్చర్ల వాసులు


పతకాలు సాధించిన పౌర్ణమి

**మహబూబ్‌నగర్/ జడ్చర్ల, మే 10 ప్రభాతవార్త:** 3వ తెలంగాణ రాష్ట్ర స్థాయి త్రోస్ జమ్స్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ జెఎన్ స్టేడియం హనుమకొండలో జరిగిన పోటీల్లో మహబూబ్ నగర్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించి డిస్కస్ త్రో ఈవెంట్ లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి 29.69 మీటర్స్ డిస్టెన్స్ తో మొదటి స్థానం పొంది గోల్డ్ మెడల్ సాధించింది. అదేవిధంగా షాట్ పుట్ ఈవెంట్లో 8.49 డిస్టెన్స్ తో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం మల్లాపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి కూతురు పౌర్ణమి మూడవ స్థానం పొంది బ్రాంజ్ మెడల్ సాధించారు. పౌర్ణమి ఈ సందర్భంగా మహబూబ్ నగర్ అథ్లెటిక్ సెకరెట్రీ జి.శరత్ చంద్ర మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ నిరంతరంగా పతకాలు సాధిస్తున్న పౌర్ణమిని అభినందించారు. రానున్న రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీడీ ఆనంద్ మహబూబ్‌నగర్ స్టేడియం కోచ్ సునీల్, జడ్చర్ల కోచ్ శ్రీనివాస్ ఈసందర్భంగా పౌర్ణమిని అభినందించారు.

# తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తెద్దాం

- నీళ్లు, నిధులు, నియామకాల నినాదం నెరవేరలే
- డబల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యం
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



**మహబూబ్‌నగర్, మే 10, ప్రభాతవార్త:** పశ్చిమ బెంగాల్ మాదిరి తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకువద్దామని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో ప్రధాని మోడీ బహిరంగ సభలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రసంగించారు. నీళ్లు నిధులు నియామకాల నినాదం నేటికీ నెరవేరలేదని, బిఆర్ఎస్ కాంగ్రెస్‌లో హామీల పేరుతో ప్రజలను మోసం చేశాయని ఆరోపించారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రజల కల సాకారం కావాలంటే, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే కలలుగన్న తెలంగాణ సాకారం కావాలంటే తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే బిజెపితోనే సాధ్యం అని పేర్కొన్నారు. వికసిద్భారత్ లో ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో పదివేల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారని వివరించారు. పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రంలో కూడా బిజెపిని గెలిపించారంటే నరేంద్ర మోడీ దేశ భవిష్యత్తును

-మిగతా4లో..

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# అమరావతిపై ఉన్న శ్రద్ధ.. హైదరాబాద్‌పై ఏది?

- తెలంగాణపై బిజెపిది సవతి తల్లి ప్రేమ
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఏమైంది?
- అలంకార ప్రాయంగా రాష్ట్ర బిజెపి ఎంపీలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నోసార్లు రాష్ట్రానికి వచ్చి వెళ్లినా, తెలంగాణకు కేంద్రం నుంచి అదనంగా లభించిన ప్రయోజనాలు ఏమిటో బీజేపీ నేతలు చెప్పాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాదులోని సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు రాష్ట్రానికి తీసుకొచ్చిన ప్రత్యేక ప్రాజెక్టులు, అదనపు నిధులు ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచీ సవతి తల్లి ప్రేమ చూపిస్తూ నిరక్ష్య వైఖరిని అవలంబిస్తోందన్నారు. పాలమూరు ప్రాంతానికి జాతీయ హోదా ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని, అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టుకు మాత్రం కేంద్రం భారీ నిధులు విడుదల చేస్తూ శరవేగంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటోందని ఇదే అందుకు ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంపై ఈ వివక్ష, ఈ నిరక్ష్యం ఎందుకు జరుగుతోందో బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. గుజరాత్‌కు చెందిన పెద్ద వ్యాపారవేత్తలకు లాభం చేకూరేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అదాని, అంబానీ వంటి కార్పొరేట్ వ్యాపారవేత్తల ప్రయోజనాలకే కేంద్రం పనిచేస్తుందని ఆరోపించారు. భగవంతుణ్ని చూసి తన్మయత్వానికి లోనైనట్లు కొందరు మోదీ భక్తులు వ్యవహరిస్తున్నారని, ప్రజల సమస్యల కంటే వ్యక్తి ఆరాధనకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలకు వచ్చే నిధుల్లో కనీస భాగం కూడా తెలంగాణకు ఇవ్వడం లేదని తెలంగాణ బీజేపీ ఎంపీలు ప్రజల సమస్యలపై మాట్లాడటానికి కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడానికే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ఉత్తర భారత రాష్ట్రాలకు భారీగా నిధులు కేటాయిస్తున్న కేంద్రం, తెలంగాణ అభివృద్ధిని మాత్రం పూర్తిగా నిరక్ష్యం చేస్తోందన్నారు. పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎం" అని విమర్శించిన మోదీ, అవినీతి జరిగిందని ఆరోపించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇన్ని సంవత్సరాలు గడిచినా కేసీఆర్ కుటుంబంపై ఒక్క కేసు కూడా ఎందుకు నమోదు చెయ్యలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ - బీజేపీ బంధం ఫెవికాల్ కంటే బలమైన బంధంలా కనిపిస్తోందన్నారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకం అమలు చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తున్నారని, బుల్లెట్ ట్రైన్‌ల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసే కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలు, విద్యా వ్యవస్థ కోసం మాత్రం సరైన నిధులు ఇవ్వడం లేదని అరపించారు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం అనుమతులు ఇవ్వలేదన్నారు. దేశ హితం కంటే స్వార్థ రాజకీయాలకే బీజేపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అమరావతి అభివృద్ధి కోసం కేంద్రం వేగంగా పనిచేస్తుంటే, హైదరాబాద్ అభివృద్ధి విషయంలో మాత్రం నిరక్ష్యం చూపుతోందని తీవ్రంగా మండిపడ్డారు.

## రైతులు పండించిన

# ప్రతి ధాన్యపు గింజలు కొంటాం..

- రైతులు తాలు చెత్త లేకుండా నాణ్యమైన వడ్లు తీసుకురావాలి
- వడ్ల కొనుగోలు ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి
- మిల్లర్లు తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


వెబ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, మే 10,ప్రభాతవార్త:** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆదివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సివిల్ సప్లై అధికారి, వ్యవసాయ, కోపరేటివ్, తహసీల్దార్లు, మిల్లర్లు, ఐకెపి సహకార సంఘాల వడ్లు కొనుగోలు కేంద్రాల సభ్యులతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి వరి కొనుగోలు ప్రక్రియను సమీక్షించారు. రైస్ మిల్లుల్లో ధాన్యం త్వరగా దించుకోకుండా రోజుల తరబడి లారీలు ఆగిపోవడం, కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడం పై వివరాలు అడిగారు. లారీల్లో తెచ్చిన వడ్లు నాణ్యత లేవని, తాలు, చెత్త ఎక్కువగా ఉండటం వల్ల ఎఫ్‌సిఐకి నాణ్యమైన బియ్యం తిరిగి ఇవ్వడం సాధ్యం కాదని,అందుకే రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన వడ్లు ఇవ్వాల్సిందిగా కోరుతున్నట్లు మిల్లర్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ రైతులు సైతం సహకరించి తూర్పారబట్టిన వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని నాణ్యమైన వడ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోలు చేసి డబ్బులు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేయడంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు వచ్చిన లారీలను త్వరగా ఖాళీ చేసి పంపించాలని, రోజుల తరబడి మిల్లుల వద్ద ధాన్యం లారీలు పెట్టుకోవద్దని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని, అకాల వర్షాలు ఎప్పుడైనా వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి రబీ కొనుగోలు ప్రక్రియను విజయ వంతం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, డిసిఓ రాణి, తహసీల్దార్లు, మిల్లర్లు, ఐకేపి, సహకార సంఘం కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామస్తుల ఐక్యత

## గ్రామదేవతల పండగలతోనే.

- మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న జూపల్లి కృష్ణారావు, తూడి మేఘారెడ్డి

ఎనలేని నమ్మకంతో నిర్వహించే గ్రామదేవతల పండుగలతో గ్రామస్తుల మధ్య ఐక్యత పెంపొందిస్తాయని, బండలాగుడు పోటీలకు ఒక ప్రత్యేకత ఉంటుందని, ఈ పోటీల్లో పోటీపడే వృషభరాజులను ప్రత్యేక శ్రద్ధతో పెంచుతారని, రైతులు మాత్రమే ఇలాంటి పోటీలలో పాల్గొంటారని తెలిపారుపర్యాటక సాంస్కృతిక ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.

## కొనుగోలు చేసిన మక్కలు..

# దింపుకోవడానికి ఇంకెన్నాళ్లు

### ఉప్పునుంతలలో భారీగా నిలిచిపోయిన మక్కల లారీలు, డీసీఎంలు


ఉప్పునుంతల గోదాం వద్ద మక్కలు నింపుకుని వచ్చి గోదాం వద్ద నిలిచిన లారీలు, డీసీఎంలు

**ఉప్పునుంతల, మే10 ప్రభాతవార్త:** యాసంగిలో రైతులు సాగు చేసుకున్న మొక్క జొన్న కొనుగోలు చేసి లారీలతో నింపుకొని వచ్చి గోదాం చుట్టూ నిలిచిపోయా యి. మార్క్ ఫెడ్ అధికారుల నిర్లక్ష్యంతో లారీలు ,డీసీఎంలు నిలిచి పది రోజుల తర్వాత దింపుకోవడానికి మోక్షం కుదరడం లేదు. ఉప్పునుంతల మండలంలో మొక్కజొన్న కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా ఇతర ప్రాంతాల వారికి మొక్కజొన్న కొనుగోలు కేంద్రా లు అప్పగించడం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలు గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ నిలిచి పోయాయి. తెలకపల్లి మండలం నుంచి మొక్కజొన్న కొనుగోలు చేసిన లారీలు, డీసీఎంలులోడుతో మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎసిఎస్ వారి గోదాం లో అన్లోడింగ్ చేయాల్సింది. కానీ మార్క్ ఫెడ్ అధికారులు చుట్టపు చూపు లాగా వచ్చి అన్లోడింగ్ ఈరోజు కాదని చెప్పుకుంటూ వెళ్లడంతో మొక్కజొన్న తీసుకొచ్చిన లారీ, డిసిఎం డ్రైవర్లు గోదాం వద్ద పడిగాల్పులు కాస్తున్నారు. రైతులు పండించిన పంటను విక్రయించేందుకు ఒక ఎత్తు అయితే, మొక్కజొన్న కొనుగోలు చేసినవారు వెంటనే దింపుకోకపోవడంతో నిత్యం వెయిటింగ్ చార్జీ రైతులనుంచి లారీ, డిసిఎం వారు వసూలు చేస్తున్నారు. డీసీఎం వారికి రూ.2 వేలు,లారీకీ రూ.5 వేలు ప్రతినిత్యం రైతు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాపది రోజుల నుంచి అన్లోడింగ్ కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విక్రయాలు ప్రతిష్టాత్మంగా నిర్వహించకపోవడంతో ఈ నష్టం రైతులపై పడుతుందని, తాము పండించిన పంట అమ్ముకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుందని సుదూర ప్రాంతాల నుంచి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. మండల కేంద్రంలో ఉన్న గోదాంలో దింపు కోవడానికి ఇన్ని రోజులు పడుతుందా, ఎవరి లోపం దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని మొక్క జొన్న కొనుగోలు చేసి ధాన్యాన్ని వెనువెంటనేదింపు కోవాలని ఆదేశాలుజారీ చేసి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఇండ్ల మధ్య గోదాం ఉండడంతో..**

మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ( సొసైటీ) బ్యాంకు గోదాం గ్రామ నడిబొడ్డున ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి లారీలు, డీసీఎం లు మొక్కలు తీసుకొని వచ్చి ఇళ్ల మధ్య నిలిపి వేయడంతో తాము ఇళ్లకు వెళ్లడానికి ఎంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అచ్చంపేటకు వెళ్లేప్రధాన రహదారులు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పది రోజుల నుంచి నిలిచిపోయిన లారీలు, డీసీఎం ల నుంచి మొక్కలు అన్‌లోడింగ్ వెంటనే చేయాలని డిమాండ్ ఉప్పునుంతల గ్రామస్తులు కోరుతున్నారు.

# సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయొద్దు

- అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేస్తే చర్యలు తప్పవు
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి



**మహబూబ్‌నగర్ క్రైమ్, మే 10 ప్రభాత వార్త :** జిల్లాలో వర్గాల మధ్య అపోహాలు లేదా ఉద్రిక్తతలు కలిగించేలా సోషల్ మీడియా వేదికల ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేయడం, అసత్య ప్రచారాలు,ఫేక్ న్యూస్ షేర్ చేయడం చట్టపరంగా చర్యలకు గురయ్యే అంశాలుగా పరిగణించ బడతాయని జిల్లాఎస్పీ డి.జానకి తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్ లను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, నిర్ధారించని సమాచా రాన్ని ఫార్వర్డ్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సమా జంలో అపోహాలు లేదా ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, వీడియోలు, కామెంట్లు చేయడం మంచిది కాదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో సోషల్ మీడియా పర్యవేక్షణ కొనసాగుతోందని, చట్టాన్ని ఉల్లంఘించేవిధంగా వ్యవహరించిన వారిపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడడం ప్రతిపౌరుడి బాధ్యత అని, సామాజిక ఐక్యతను పరిరక్షించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఎలాంటి అసత్య ప్రచారం లేదా అనుచిత పోస్టులు గమనించినట్లయితే జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360 కు సమాచారం ఇవ్వగలరు. అందించిన సమాచారం గోప్యంగా ఉంచబడుతుంది.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్
- రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్


తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

**శ్రీరంగాపూర్, మే10 ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలనుండి మిల్లులకు చేరుకున్న ధాన్యం వాహనాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అన్ లోడింగ్ చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం అదనపు కలెక్టర్ శ్రీరంగాపూర్ మండలం, శేరిపల్లి గ్రామంలోని సప్తగిరి రైస్ మిల్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం అన్ లోడింగ్ (దించుకోవడం) ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన రైతులకుఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని అధికారులకు, మిల్లు యాజమాన్యానికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మిల్లుకు చేరుకున్న ధాన్యం వాహనాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అన్ లోడింగ్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైతులు మిల్లుల వద్ద వేచి ఉండాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం అన్ లోడింగ్ సమయంలో కిలోల రూపంలో ఎటువంటి తరుగు తీయకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో ధాన్యాన్ని సేకరించాలని, రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రైస్ మిల్‌కు నియమించబడిన స్పెషల్ ఆఫీసర్, లారీల రాకపోకలకు సంబంధించి (ఎంట్రీ అండ్ ఎగ్జిట్) ప్రత్యేక రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఏ లారీ ఎప్పుడు వచ్చింది, ఎప్పుడు ఖాళీ అయ్యింది అనే వివరాలు అందులో నమోదు చేయాలన్నారు. లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడానికి ప్రతి రైస్ మిల్‌కు గ్రామ పంచాయతీ అధికారులను (జిపిఓస్) నియమించినట్లు ఆయన తెలిపారు. వీరు మిల్లు వద్ద ఉండి ధాన్యం సేకరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూస్తారని పేర్కొన్నారు. రైతులు ఆష్టకష్టాలు పడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో మిల్లర్లు నిబంధనలు అతిక్రమించకూడదని, ఎక్కడైనా తరుగు పేరిట మోసం చేసినా, వాహనాలను నిలిపివేసినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

## మొక్కజొన్న రైతుల గోస

# ప్రభుత్వానికి పట్టదా..?


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**మిడ్జిల్, మే 10 ప్రభాతవార్త:** యాసంగిలో రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడం చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం అని జిల్లా నాయకులు సుధా బాల్‌రెడ్డి అన్నారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ నిన్న జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డు దగ్గర మొక్కజొన్న రైతులు దాదాపు 30 రోజుల నుంచి పడిగాపులు కాస్తున్న పట్టించుకునే వారు లేకపోవడం తో విసుగు చెందిన రైతులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి వర్యులు లక్ష్మారెడ్డి రైతుల దగ్గరికి వెళ్లి మాట్లాడి వారి సమస్యలను అధికారులదృష్టికి తీసుకెళ్లి ధర్నా విరమింప చేశారని తెలిపారు. బాధ్యతగల జడ్చర్ల ఎమ్మెల్యే రైతుల సమస్యలను పట్టించుకోకుండా దిగజారుడు మాటలు మాట్లాడడం సిగ్గుచేటని వారు విమర్శించారు. మూడు ఏళ్ల నుంచి అవినీతి భూ కబ్జాలు అని మాట్లాడుతున్న మీరు ఇప్పటివరకు ఒకటి కూడా నిరూపించలేని అసమర్థత ఎమ్మెల్యే అని వారు విమర్శించారు. జడ్చర్ల ఎమ్మెల్యే ఆత్మ విమర్శ చేసుకొని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకోసారి ఇలాగే మాట్లాడితే రానున్న రోజుల్లో ప్రజలు తగినవిధంగాబుద్ధి చెప్తారని ప్రభుత్వము తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బిఆర్ఎస్ పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాండు యాదవ్, మాజీ ఎంపీపీ బరిగలసుదర్శన్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జంగారెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్, గోపాల్ ముదిరాజు,నాయకులు గంజి కృష్ణ, కాడయ్య భీమ్‌రాజు,సుకుమారు, నవీనాచారి, వెంకటయ్య, బుచ్చయ్య, రాఘవేందర్, భాస్కర్, రవీందర్, మంగల్, నరసింహ, జగన్ గౌడ్, వార్డు సభ్యులురమేష్, శ్రీశైలం, తిరుపతి నాయక్, విజయ నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య కోరల్లో అన్నదాతలు

- శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు పంటలు నాశనం
- కంపెనీపై పొల్యూషన్ కంట్రోల్ అధికారుల చర్యలేవి..?


పంట పొలాలు దగ్గరగా కంపెనీ

# ప్రశాంతంగా టిజిఎఫ్ సెట్ ప్రవేశపరీక్ష

**పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఉన్నత విద్యా మండలి చైర్మన్, పియు విసి**

**మహబూబ్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ॥ వి. బాలకిష్ట రెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్, జెపి ఎంసిలో (టీజీ ఎఫ్ సెట్ 2026 ఎంట్రన్స్ ఎగ్జామ్స్ )ప్రవేశ పరీక్షను తనిఖీ చేసి,సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, కంప్యూటర్ ల్యాబ్‌లు, విద్యుత్ సరఫరా,తాగునీరు ఇతరమౌలిక వసతులపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధితసిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులుకలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.





పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విద్యా మండలి చైర్మన్, పియు విసి..
పరీక్షకు హాజరైన అభ్యర్థులు

కార్యక్రమంలో జెపిఎన్‌సిఈ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కళాశాలలో విద్యా వారోత్సవాలు

### నేటి నుంచి మే 17వరకు నిర్వహణ



ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్

**మహబూబ్‌నగర్, మే 10, ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలలో మే 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా వారం రోజుల పాటు మొదటి రోజు (మే 11) కళాశాల స్థాయి మౌలిక సదుపాయాల శంకుస్థాపన, రెండవరోజు (మే 12) జిల్లాస్థాయి విద్యార్థుల విద్యా సహాయం, శ్రేయస్సు కార్యక్రమాలు, మూడవ రోజు (మే 13) నియోజక వర్గస్థాయి విద్యా సహాయ సదస్సు, నాల్గవరోజు (మే 14) కళాశాల స్థాయి మెగా పేరెంట్ టీచర్ మిటింగ్, ఐదవరోజు (మే 15) కళాశాల స్థాయి మన గ్రంథాలయ జ్ఞానోత్సవం, ఆరవరోజు (మే 16) జిల్లా స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై అవగాహన, ఆవిష్కరణ, ఏడవరోజు (మే 17) జిల్లా స్థాయి ఇన్స్టిట్యూషనల్ ఎక్సలెన్స్, రికగ్నిషన్, వంటి విభిన్న కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. విద్యార్థినిలు, తల్లి దండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాజీ మంత్రి లక్ష్మారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



మాట్లాడుతున్న బిఆర్ఎస్ యువజన నాయకులు

**జడ్చర్ల, మే 10, ప్రభాతవార్త:** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పిఎసిఎస్ పదవి ప్రమాణ స్వీకారోత్సవం సన్మాన కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని నోటికి వచ్చిన విధంగా అమర్యాదగా మాట్లాడడంతో బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులు తీవ్రంగా పరిగణించారు. మాజీ మంత్రిని గుడికి విడిచిన ఆవు లాంటివాడివని, పంది అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఒకమాజీ మంత్రి అని కూడా కనీస మర్యాద లేకుండా నోటికి వచ్చిన విధంగా మాట్లాడినందుకుగాను జడ్చర్ల బిఆర్ఎస్‌యువత విభాగం ఆధ్వర్యంలో దిష్టి బొమ్మ దగ్ధం చేసే యత్నంలో పోలీసులు అడ్డుకుని జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో యువత నాయకులు కాటేమోని బాలు ముదిరాజ్, ఈటె శ్రీనివాస్, సోహైల్, మహమూద్, శివముదిరాజ్, .శ్రీకాంత్, తబ్రేజ్, విజయ్ పాల్గొన్నారు.

## ఉప్పునుంతల సోసైటి బ్యాంకు వారి సౌజన్యంతో డికార్డ్ గ్రేటర్ పనులు



డికార్డ్ గ్రేటర్ లో అదునాతనమైన యంత్రాల బిగింపు

**ఉప్పునుంతల, మే 10 ప్రభాతవార్త :** స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సోసైటి) బ్యాంకు వారి సౌజన్యంతో రైతులకు అందుబాటులో ఉంచేందుకు డికార్డ్ గ్రేటర్ పనులు వేగవంతం కొనసాగుతున్నాయి. సోసైటీ బ్యాంకు వారు రైతుల నుంచి సేకరించిన వేరుశనగను సీడ్ గా మార్చి రైతులకు అందుబాటులో ఉంచేందుకు ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావు వివరించారు. అదే విధంగా గోదాం సమీపంలో రైతులు ఇబ్బందులు పడకుండా వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. డికార్డు గ్రేటర్ ప నులు పూర్తి అవుతే వేరుశనగ విత్తనాల కోసం ఇతర ప్రాంతాల వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని, సోసైటి నుంచి సీడ్ రైతులకు అందజేసే సౌకర్యం కల్పించడం తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2022 లో 1500 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల గోదాం నిర్మించారు. అనతి కాలంలోనే గోదాం సమీపంలోడికార్డ్ గ్రేటర్ నిర్మాణం చేపట్టడంతో మండల రైతులకు మరింత సౌకర్యం ఏర్పడుతుందని, వేరుశనగ సీడ్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ



ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, మే 10 ప్రభాతవార్త :** మక్తల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా వాసవి క్లబ్ గవర్నర్ కల్మిచర్ల రమేష్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడం జరిగింది. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మేడిశెట్టి హరికృష్ణ మాట్లాడుతూ గవర్నర్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. మాకు వెన్నంటే ఉండి మమ్మల్ని ప్రోత్సహిస్తూ క్లబ్ సేవా కార్యక్రమాలను తమ సలహాలు, సూచనలతో మమ్మల్ని ప్రోత్సహిస్తున్న గవర్నర్ పుట్టిన రోజున ప్రభుత్వ ఆసుపత్రిలో సేవ చేయడం ఆనందంగా ఉందని, ప్రతిసంవత్సరం వాసవి క్లబ్ సభ్యుల పుట్టినరోజునా ఏదో ఒక కార్యక్రమం చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. అలాగే మాతృ దినోత్సవ సందర్భంగా మాతృమూర్తులు అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ.. వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ తన తల్లి కి చీర బహుకరిస్తూ, ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ, కోశాధికారి తాలంపల్లి పవన్ మాజీ డిప్యూటీ గవర్నర్ దొంత నరహరి, మాజీ ప్రెసిడెంట్ బిలకంటి నరసయ్య, వనిత క్లబ్ ప్రెసిడెంట్ కల్వల ప్రసన్న, తెలంగాణ రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి కొండా విజయకుమార్, డా. ప్రహ్లాద్, అక్షయ్ మెడికల్ అగ్లర్ అశోక్ కుమార్, వట్టం కిరణ్ కుమార్, పేషెంట్లు, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు గుడిబండలో సవరమ్మ జాతర

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌని అమరేశ్వర్ రెడ్డి



సవరమ్మ అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్లో ) అమ్మవారి మూలవిరాట్టు

**దేవరకద్ర, మే 10 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గుడిబండ గ్రామంలో మంగళవారం ఘనంగా సవరమ్మ జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌని అమరేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వంగా సుందరంగా తీర్చిదిద్దినట్లు ఆయన తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అమ్మవారి పూజా కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవానికి పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. జాతర ఏర్పాట్లు గ్రామ పెద్దలు యువకులు కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్ భద్రత ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు. కావున జాతరకు భక్తులు ,గ్రామస్తులు, అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని అమరేశ్వర్ రెడ్డి కోరారు.

## నేటి నుంచి విద్యా వారోత్సవాలు..

### దేవరకద్ర మండల విద్యాధికారి పి.బలరాం



విద్యాధికారి బలరాం

**దేవరకద్ర, మే 10 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నేటి నుండి 17 వ తేదీ వరకు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవరకద్ర మండల విద్యాధికారి పి. బలరాం తెలిపారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి సూచించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, ప్రజా ప్రతినిధులతో విద్యాభివృద్ధిపై చర్చించాలని తెలిపారు. 13న సర్పంచులు మరియు మున్సిపల్ వార్డు మెంబర్లతో నియోజకవర్గస్థాయి సమావేశం ఉంటుందని తెలిపారు. 14న ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు తేదీ 11 మే 2026 నుండి 25 మే 2026 వరకు పిఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బాలికల దేవరకద్ర నందు చిత్రలేఖనం, క్రాఫ్ట్ హ్యాండ్ స్కిల్స్, సంగీతము, స్పోకెన్ ఇంగ్లీష్, క్రీడలు పై సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

## రైతుల పేరుతో నిరసన చేయడం కాదు

**మాజీ ఎమ్మెల్యే ఆల గారు మీ పాలనలో రైతులకు చేసిన అన్యాయాలను గుర్తు చేసుకోండి**

**సమస్యలకు పరిష్కారం చూపించడం ముఖ్యం**

**ప్రజా ప్రభుత్వం పై లేనిపోని నిందారోపణలు చేయడం సమంజసం కాదు**

**దేవరకద్ర కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి**



మాట్లాడుతున్న దేవరకద్ర కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన దేవరకద్ర కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి

**దేవరకద్ర, మే 10 ప్రభాతవార్త:** పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు రైతుల ధాన్యం కొనుగోలు వ్యవస్థను శాశ్వతంగా బలోపేతం చేయకుండా, ఇప్పుడు రాజకీయ డ్రామాలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని దేవరకద్ర కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర మండలం గోపన్ పల్లి గ్రామంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వరి కొనుగోలు విషయంలో రాజకీయ లబ్ధి కోసమే మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు. రైతుల పేరుతో నిరసనలు చేయడం కాదు, సమస్యలకు పరిష్కారం చూపించడం ముఖ్యమన్నారు. మా ప్రజా ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటుంది అన్నారు. అకాల వర్షాలు, రవాణా సమస్యలు, మిల్లుల సమన్వయం వంటి ఇబ్బందులను అధిగమిస్తూ, రైతులకు నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాత ప్రభుత్వం. రైతు పండించిన ప్రతి గింజను గిట్టుబాటు ధర అందేలా, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటుందని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అన్నారు. అదేవిధంగా గోపన్ పల్లి సర్పంచ్ బాలరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకుల పరిస్థితి ఎలా ఉందంటే వాళ్ళు వచ్చేది ఒక పని మీద, చేసేది వేరొక పనిమీద, పెళ్లిలకు, పేరంటాలకు వస్తుంటారు. అదవ్వగానే రైతుల కల్లాల వద్దకు వచ్చి, పని చేసుకుంటున్నా రైతుల పనికి అడ్డం పడుతూ ఫోటోలకు ఫోజులిస్తూ, ప్రజా ప్రభుత్వంపై లేనిపోని నిందారోపణలు చేస్తుంటారు. దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ప్రారంభించిన 25కు పైగా వరి కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు దాదాపు లక్షకు పైగా ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకులు, రైతుకు మంచి చేస్తున్న ప్రజా ప్రభుత్వం పట్ల ఈర్షతో తప్పుడు ప్రచారాలు చేయడం సరైన పద్ధతి కాదు. బిఆర్ఎస్ నాయకులే రైతులతో డాన్ సీడ్స్ ఒప్పందం చేసుకున్నారు. రైతులు తప్పుడు సమాచారం నమ్మవద్దు, ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని గోపన్ పల్లి సర్పంచ్ బాల్ రాజ్, సురేందర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు రాంబాబు, యూత్ కాంగ్రెస్ దేవరకద్ర నియోజకవర్గ వైస్ చైర్మన్ కుమ్మరి బుచ్చన్న, శ్రీనివాసులు, వడ్డే ప్రసాద్, బాబు, రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో సమస్యలను పరిష్కరించాలి

**జూరాల,భీమ లింక్ కెనాల్ మరమ్మత్తులు ఏర్పాటుచేసి వానాకాలం సాగునీరుకు సిద్ధంగా ఉంచాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎండి జబ్బార్

**వీపనగండ్ల మే 10, ప్రభాతవార్త;** వరి కొనుగోలు కేంద్రాల లో రైతుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా వర్షాకాలము సీజన్ ప్రారంభం కావడం జరుగుతుందని అంతలోపు జూరాల భీమ కాలువల్లో పేరుకుపోయినటువంటి మట్టి నిల్వలను జమ్మూ ఇతరత్న పనులను వెంటనే చేపట్టి చివరి ఆయకట్లకు నీరు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ వనపర్తి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి జబ్బార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ సమావేశం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఎం. కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలలో నెలలు తరబడి రైతులు ధాన్యం తీసుకొచ్చి కేంద్రాలలో పోసిన నేటికీ గన్ని బ్యాగులు, లారీల కొరత వల్ల ఎక్కడివి అక్కడనే ఉండి రైతులు ఇబ్బందులు గురవుతున్నారు. పండించిన పంటను వడ్లు తూకం చేసి లారీలకు పంపితే తూకం, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు గురి చేస్తూ క్వింటాల్కు ఐదు కేజీల నుంచి 8 కేజీల వరకు అదనంగా దోపిడీ చేస్తున్నారు. దీనిని వెంటనే అరికట్టాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నేడు జరిగే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎండాకాలంలో జూరాల, బీమా కాలువలు లింకు కెనాల్ మరమత్తులకు నోచుకోక తాగునీరు వృధా అవుతుంది, ఎండాకాలం సమయంలో ఈ మరమ్మత్తులకు నిధులు ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయిస్తే జూరాల చివరి ఆయకట్టు వరకు నీరందే అవకాశం ఉందన్నారు. భీమ, కేఎల్ఐ కాలువలు కూడా పెండింగ్ పనులు ఉన్నాయి వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి డి. బాల్ రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. కృష్ణయ్య, రవి ప్రసాద్, మండల నాయకులు ఆది, ఆశన్న, నిరంజన్, బాల గౌడు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ సభకు కదిలిన కాషాయ దళం



ప్రధాని మోడీ సభకు బయలుదేరిన బిజెపి నాయకులు

**మదనాపురం, మే 10 ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో మదనాపురం మండల నుంచి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు భారీ ఎత్తున కార్యకర్తలు, అభిమానులు ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరారు. హైదరాబాద్‌లో జరిగే చారిత్రాత్మక సభతో పాటు రాష్ట్ర ప్రగతికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మోదీ రావడంతో తెలంగాణ వ్యాప్తంగా ఉత్సాహం నెలకొంది. ఈక్రమంలో మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు, మండల కేంద్రంలో ఈ భారీ ర్యాలీని మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అజేయ శక్తిగా ఎదుగుతోంది. మాటలు కాకుండా చేతలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నాయకుడు మోదీ తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నేడు జరగబోయే శంకుస్థాపనలే నిదర్శనం. జాతీయ రహదారుల విస్తరణ నుంచి రైల్వే ప్రాజెక్టుల వరకు కేంద్రం అందిస్తున్న భారీ నిధులు తెలంగాణ అభివృద్ధికి వెన్నుముకగా నిలిచాయి" అని అన్నారు. ప్రజల పక్షాన, కార్యకర్తల పక్షాన మోదీకి ఘన స్వాగతం పలకడానికి మనం వెళ్తున్నామన్నారు. ఈ పర్యటన తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలవబోతోంది. అభివృద్ధిని కాంక్షి ంచే ప్రతి ఒక్కరూ మోదీ వెంట నడవాల్సిన సమయం వచ్చింది. మన ప్రధానిని మన రాష్ట్ర గడ్డపై చూసుకోవడం మనందరికీ గర్వకారణం" అని ఆయన ఉద్వేగంగా పేర్కొన్నారు. మోదీ సబ్ కా సాత్, సబ్ కా వికాస్" మంత్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సభ ఒక వేదికగా మారుతుందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, వెంకటేశ్వర శెట్టి, దుప్పల్లి కృష్ణ, అమర్నాథ్ శెట్టి, రాజశేఖర్, శివ, భాస్కర్, నితిన్, భూరాన్, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు, తదితరులు బయలుదేరారు.

## చెరువు అభివృద్ధి, నీటి సామర్థ్య పెంపుపై సమావేశం

**రాజకీయాలకు అతీతంగా నిర్ణయం**

**ధన్వాడలో ముదిరాజ్ కుటుంబాల సమావేశం**

**ఎత్తిపోతల పథకం నీటిని చెరువుకు మళ్లించి**

**చేపల పెంపకంతో ఆదాయం పెంచాలని పిలుపు**

**ధన్వాడ, మే 10 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో ముదిరాజ్ కుటుంబీకులు రాజకీయాలకతీతంగా ఐక్య సమావేశం నిర్వహించి, పెద్ద చెరువు అభివృద్ధి, పూడిక తీత, నీటి నిల్వ సామర్థ్య పెంపుపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు పాత్రికేయులతో మాట్లాడారు. సమావేశంలో మాట్లాడిన నాయకులు, గ్రామంలోని పెద్ద చెరువును విశాలం చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు గత రెండు సంవత్సరాలుగా పూడిక (వండుమట్టి) తొలగింపు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే మట్టి తొలగించడంతో చెరువులో నీరు సమృద్ధిగా నిల్వ ఉండటంతో పాటు చేపల పెంపకానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. చిన్నపాటి వర్షాలకు కూడా చెరువు నిండిపోవడం, రోడ్డువరకు నీరు చేరడం చెరువు లోతు తక్కువగా ఉన్నదని సూచిస్తోందని, మరింత పూడిక తొలగిస్తే నీటి నిల్వ సామర్థం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకుడు కావలి నరహరి మాట్లాడుతూ నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా భారీ స్థాయిలో సాగునీటి వనరులు లభించే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్టులో లక్షా పది వేల ఎకరాలకు సాగునీరు అందించేలా డీపీఆర్ సిద్ధమైందని తెలిపారు. ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో జాయమ్మ చెరువుకు వెళ్తున్న నీటిని ధన్వాడ పెద్ద చెరువుకు మళ్లించే ప్రణాళిక రూపొందించబడిందని వెల్లడించారు. అయితే ప్రస్తుత ప్రణాళికలో ధన్వాడ మండలానికి కేవలం సుమారు పది వేల ఎకరాలకే ఆయకట్టు చూపించబడిందని, ఇది మండలానికి అన్యాయం అని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో స్థానికంగా చెరువును అభివృద్ధి చేసి పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసుకుంటే, చెరువు కింద ఉన్న చిన్న చెరువులు, కుంటలు కూడా నింపుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. చెరువులో నీటి నిల్వ సంవత్సరం పొడవునా ఉంటే చేపల పెంపకాన్ని ఎక్కువ కాలం కొనసాగించి మంచి ధరలకు విక్రయించి ముదిరాజ్ కుటుంబాలు ఆర్థికంగా బలపడవచ్చని తెలిపారు. అదేవిధంగా చెరువు నిండడం వల్ల భూగర్భ జలాలు పెరిగి రైతుల బోర్లు రీఛార్జ్ అవుతాయని, పశువులకు తాగునీటి సమస్య తీరుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువులో పూడిక తీయడానికి ఇదే సరైన సమయం కావడంతో, ప్రభుత్వ అనుమతులతో పనులు అడ్డంకులు లేకుండా కొనసాగేందుకు అధికారులు సహకరించాలని కోరారు. చెరువు పూడిక తీతను అడ్డుకోవడం వల్ల రైతులు, మత్స్యకారులు, ముదిరాజ్ సమాజానికి నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు వెంటనే స్పందించి చెరువు పూడిక తీత పనులు పూర్తి చేసి, ఎత్తిపోతల పథకం నీటితో చెరువును నింపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నీరటి నరసింహులు నాయుడు, ముదిరాజ్ కావాలి నరహరి ఎల్ఐసీ నారాయణ, అచ్చిబాబు, సంద లక్ష్మయ్య, సంద బాలరాజ్, వెంకటయ్య, వెంకటేష్ భాస్కర్, కురుమూర్తి, విష్ణు, నీరటి బాబా, అనిల్ తదితర ముదిరాజ్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ నాయకులు

## మాతృమూర్తుల ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల





తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే జీఎంఆర్,మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్,మే 10,ప్రభాతవార్త :** మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్),మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు తమకు జన్మనిచ్చిన మాతృమూర్తుల ఆశీర్వాదం తీసుకున్నారు. మాతృదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ తన మాతృమూర్తి గవినోళ్ల పద్మమ్మకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇదేవిధంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాతృదినోత్సవం సందర్భంగా అన్నాసాగర్‌లో తన తల్లి వరలక్ష్మమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు.

## వీరేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, మే 10, ప్రభాతవార్త:** తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, జడ్చర్ల మండల బిఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షుడు వల్లూరు వీరేష్ కు మాజీ మంత్రి బి ఆర్ ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరేశ్ తన జన్మదినం సందర్భంగా మర్యాదపూర్వకంగా మాజీ మంత్రిని హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి, శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ బిఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షులు సుప్ప ప్రకాష్, జకినాల పల్లి సర్పంచ్, యువత అధ్యక్షులు శేఖర్ యాదవ్, మిడ్జిల్ యువత అధ్యక్షులు పట్నం బంగారు, వల్లూరు మాజీ ఎంపిటిసి రవి నాయక్, వల్లూరు మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఉదండపూర్ పార్టీ అధ్యక్షుడు శ్రీను, యువత మండల కార్యవర్గ సభ్యులు బొజ్జ మల్లేష్, శాంతి, నర్సింలు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పధాని మోడీ సభకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు



ప్రధాని బహిరంగసభకు తరలివెళ్తున్న దృశ్యం

**భూత్పూర్,మే 10,ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగసభకు భూత్పూర్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాల నుంచి అధ్యక్షులు రాంరెడ్డి, గూటం శ్రీనుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. హైదరాబాద్‌కు తరలి వెళ్లిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎండి ఫారూక్, ఇతర జిల్లా నాయకులు గాల్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి మండల నాయకులు సదానందం, మహానంది ఇతర కార్యకర్తలు తదితరులు వెళ్లారు.

## ఆటో, బైక్ ఢీకొని రిటైర్మెంట్ ఎంఈఓకు తీవ్ర గాయాలు

**పెద్దమందడి,మే10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బలిజపల్లి జగమే తల్లి మధ్యలో ఉదయం 10 గంటలకు ఆటో బైక్ ఢీకొని మల్కాపూర్ గ్రామానికి చెందిన రిటైర్మెంట్ ఎంఈఓకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారంగా ఖిల్లా ఘనపురం మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ కొండా రెడ్డి బైక్‌పై వనపర్తికి వెళ్తుండగా వనపర్తి నుండి పామ్‌రెడ్డి పల్లి వస్తున్న ఆటోను ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యారు. ఆయనను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మల్కాపూర్ గ్రామానికి చెందిన తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఉప్పరిపల్లిలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఉప్పునుంతల, మే 10 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో ఆదివారం ఐకెపి, గ్రామ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ తాము పండించిన పంటను కొనుగోలు కేంద్రం వద్ద విక్రయిస్తే, రైస్ మిల్లర్స్ కటింగ్ చేయడంతో తమకు అన్యాయం జరుగుతుందని, దీనిపై అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు తమ గోడును అధికారుల ముందు వాపోయారు. స్పందించిన ఐకెపి ఎపిఎం బాలచందర్ రైతుల ఆవేదనను గుర్తించి రైస్ మిల్లర్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐకెపి ఏపిఎం బాలచందర్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, సిఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ రేసోజు శ్రీనివాసా చారి, మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి, సిసి రాజు,విఓఎ రాజు యాదవ్, వార్డు సభ్యులు భారతమ్మ, సువర్ణ, పర్వతాలు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఉప్పరిపల్లి లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

## వివాహ కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి

**వనపర్తి, మే 10, ప్రభాతవార్త :** వనపర్తి మండలం రాజపేట పాపే తండాకు చెందిన, వశరాం కుమారుడు కాత్రావత్ సురేష్,మనీషల వివాహ కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వధూవరులు సుఖశాంతులతో, ఆనందంగా, ఐశ్వర్యాలతో నిండిన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరెడ్డి, సర్పంచ్ ఎల్లయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## జనాభా గణనకు మండల ప్రజలు సహకరించాలి

**వీపనగండ్ల తహసిల్దార్ యం.డి ఖాజా మొయినుద్దీన్**

**వీపనగండ్ల మే 10, ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వం చేపట్టనున్న 2027 జనాభా గణన తొలి విడత కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానుందని, వీపనగండ్ల తహసీల్దార్ ఖాజా మైనోద్దీన్ తెలిపారు ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆదివారం ఆయన తెలిపారు. జనాభా గణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు కీలక ఆధారమని తెలిపారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సరైన విధంగా అందించాలని సూచించారు. ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు నిజమైన సమాచారం ఇవ్వడంతో పాటు అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు.జనాభా గణన ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన మరింత సమర్థవంతంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు అందించే వివరాలను గోప్యంగా ఉంచబడతాయని, ఎక్కడ వెల్లడి కావని, ఈ గణనప్రజలు అపోహలకు లోనుకాకుండా అధికారులకు సహకరించి మండలాల్లో నిర్వహించే జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


తహసిల్దార్ కాజా మొయినద్దీన్

## నైతిక విలువలతో విద్య

**ఆర్య సమాజ్‌తోనే నైతిక యువ నిర్మాణం**

**జడ్చర్ల, మే 10, ప్రభాతవార్త:** జడ్చర్లలోని ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో నైతిక యువనిర్మాణ శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కర్ర సాము, భూమి నమస్కార్, సూర్య నమస్కార్, యోగ, ప్రాణాయామం, భజనలు ,భక్తి ప్రసంగాలు, వేదోక్త ప్రవచనాలు, విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ పోటీలు నిర్వహించారు. వేద విద్వాంసులు, ఆచార్య వేదసింధు మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ఆర్య సమాజ్, విద్యార్థులు, పితృభక్తి, మాతృభక్తి , గురుభక్తి ,దేశభక్తి దైవ భక్తి అనే అంశాల పైన శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు వేదాలను పటిస్తూ జీవితంలో మార్పులను గ్రహించాలన్నారు. విద్యార్థులకు ప్రతిభ పోటీ నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బాధిమి శివకుమార్, ప్రధాన విద్వాన్సులు వేదసింధు, బాణాల ప్రభాకర్, శ్రీనివాసులు, అధ్యక్షులు గుబ్బ నర్సింలు, మంత్రి బక్క రాజేశ్వర్, కోశాధ్యక్షులు విజయకుమార్, ఉపమంత్రులు, డి కృష్ణయ్య, బీచని లవ కుమార్ , జనార్ధన్, సంస్కార భారతి జిల్లా ఉపాధ్యక్షులు గోనెల రాధాకృష్ణ, మహిళా సంయోజకులు లావణ్య, జిపి ప్రవీణ్, వేదముని, శిక్షకులు కరెన్సీ, డింపుల్, బాలాజీ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## శుద్ధమైన జలం అందించడమే లక్ష్యం

**వెల్దండ, మే 10 ప్రభాతవార్త:**ప్రతి తాండ, ప్రతి గ్రామానికి శుద్ధమైన జలం అందించడమే తన లక్ష్యమని ఐక్యత పౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. వెల్దండ మండలంలోని పోచమ్మగడ్డ తండాలో గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.1.50లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ఆదివారం గ్రామ సర్పంచ్ మహిపాల్‌నాయక్‌తో కలిసి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శుద్ధ జలం ఎంతో ఉపయోగపడుతుందని, ఈ ప్లాంట్ ద్వారా ప్రజలకు శాశ్వతంగా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం గ్రామస్తులు రాఘవేందర్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంతులనాయక్, ఉపసర్పంచ్ గోపాల్, శ్రీరామ్, హనుమంతు, వెంకట్‌నాయక్, విమల్ నాయక్, సేవ్యానాయక్, రేక్యానాయక్, మున్యా నాయక్, జైపాల్, తిరుపతి, శ్రీను నాయక్, లక్ష్మణ్ నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

## కల్లుగీత సహకార సంఘానికి ఎన్నికల నోటిఫికేషన్

**వెల్దండ,మే10 ప్రభాతవార్త:**వెల్దండ ఉమ్మడి గ్రామాలైన వెల్దండ, కంటోనీపల్లి, గుండాల గ్రామాలలో కల్లుగీత సభ్యత్వాలు కలిగిన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అబ్కారి సహకార సంఘాల ఇన్‌స్పెక్టర్ యాదగిరి యాదవ్ అన్నారు. సహకార సంఘాల నోటిఫికేషన్ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులకు నోటిఫికేషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు ఎన్నికలు నిర్వహించబడుతాయని, గ్రామ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘాన్ని సభ్యత్వం కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకొని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మదన్ గౌడ్, విష్ణుగౌడ్, కృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.


నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

## శ్రీ కురుమూర్తి దేవస్థాన పాలకమండలి ఖరారు

### 13న ప్రమాణ స్వీకారం

**చిన్న చింతకుంట, మే 10 ప్రభాతవార్త,** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుడి ప్రతిరూపంగా కొలువబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులను నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 2న పాలకమండలి సభ్యుల జాబితా తో కూడిన జీవో కాపీ విడుదలైయింది. ఈ జాబితాలో 14 మంది పాలకవర్గ సభ్యులను పేర్లతో జీవో కాపీ జారీ అయినట్లు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి మదనేశ్వర్ రెడ్డి తెలిపారు. వీరి పదవి కాలం రెండు సంవత్సరాలు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 13న శ్రీ కురుమూర్తి దేవస్థానం ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం జరగనుంది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆలయం దేవదాయ శాఖలోకి వెళ్లిన నాటి నుంచి చైర్మన్ పీఠం ఒకే సామాజిక వర్గానికి దక్కింది. 2006 లో బీసీ సామాజిక వర్గానికి చెందిన హనుమంతరావు, ప్రస్తుతం రెండవసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన బత్తుల బాలరాజుకు చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉంది. పాలకమండలి సభ్యులు వీరే..దేవాదాయ ధర్మాదాయ శాఖ జారీ చేసిన జీవో లో 14 మంది జాబితాను విడుదల చేసింది. పాలకమండలి సభ్యులుగా బత్తుల బాలరాజు, మహేందర్, వేగనాద్ ,తిరుపతిరెడ్డి, మహిపాల్ రెడ్డి, ప్రేమ్ సాగర్, తిరుపతయ్య, శ్రీనివాసులు, నాగరాజు ,భాస్కరాచారి, శంకర్ ,ఎం బాలరాజ్ ,భరత్ కుమార్, సౌజన్య లకు అవకాశం కల్పించారు. ఈ జాబితాలో ఉన్న బత్తుల బాలరాజును దేవస్థాన చైర్మన్ గా ఎన్నుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.


శ్రీ కురుమూర్తి దేవస్థానం

### బిఆర్ఎస్ నేతలు మీరు చింతించాల్సిన అవసరం లేదు

## రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం ఉంది

**సమస్యల పరిష్కారం చూపుతున్న జిఎంఆర్**

**కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి**

**దేవరకద్ర, మే 10 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించడం, మిల్లులకు తరలించడం చాలా సవ్యంగా జరుగుతుందని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు మీరు చింతించాల్సిన అవసరం ఏమీ లేదు. రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం ఉంది. అన్నదాత పండించిన ప్రతి గింజ కొంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే జిఎంఆర్ చాలా స్పష్టంగా తెలియజేశారన్నారు. ప్రజాపాలనలో అంత సవ్యంగా ఉంది. అన్ని రంగాల్లో అభివృద్ధి సంక్షేమం జరుగుతుందన్నారు. ప్రతిపక్షంగా మీకు ఎలాగో ఏం పనిలేదు. కాబట్టి కొనుగోలు కేంద్రాల దగ్గరకు వచ్చి ఫోటోలు దిగి వెళ్ళండి. కానీ అనవసరంగా రైతుల పని చెడగొట్టి వాళ్ళ ఆగ్రహానికి గురికాకండి. మీకు ఇది మా సలహా అన్నారు. గత బిఆర్ఎస్ పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయలేదు. మాజీ ఎమ్మెల్యే ఆల పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు గురించి మాట్లాడడు కానీ 36 చెక్ డ్యాంలు కట్టించిన అని అంటారు. మీ నాయకుడు కేసీఆర్ కుర్చీ వేసుకొని మరీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తా అని అడ్రస్ లేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేసి, కనీసం 33 ఎకరాలకు నీళ్లు ఇవ్వలేదన్నారు. అలాంటిది మీరు రైతుల గురించి ధాన్యం కొనుగోలు గురించి మాట్లాడడం అంటే నవ్వొస్తుందని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి అన్నారు.


రాఘవేందర్ రెడ్డి

## పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

**నారాయణపేట, మే 10 ప్రభాతవార్త :** నారాయణపేట రూరల్ పరిధిలో రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా హిందూ, ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని ఎస్సై సతీష్ రెడ్డి నిర్వహించారు. పండుగల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, మత సామరస్యం, అక్రమ కార్యకలాపాల నియంత్రణపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ రెడ్డి మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఎవరూ ప్రవర్తించరాదని, పరస్పర గౌరవ భావంతో వ్యవహరించాలని కోరారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణా నివారణకు ఉజ్జల్లి బోర్డర్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగల సందర్భంగా నిర్వహించే ఊరేగింపులు, ప్రార్థనలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది, హిందూ, ముస్లిం మత పెద్దలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.


పీస్ కమిటి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సతీష్ రెడ్డి

### ఎస్ఐగా బాధ్యతలు

## చేపట్టిన యుగంధర్ రెడ్డి

**వెల్దండ, మే 10 ప్రభాతవార్త:** వెల్దండ ఎస్ఐగా యుగంధర్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్ఐ కురుమూర్తి కల్వకుర్తికి బదిలీ కాగా ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ నుండి యుగంధర్ రెడ్డి బదిలీపై విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.



### ఖిల్లాలో కరెంటు

## షాక్‌తో ఇరువురు మృతి

**ఖిల్లా గణపురం మే 10, ప్రభాతవార్త:** మండలంలో కరెంట్ షాక్ తగిలి వివిధ గ్రామాలలో ఇరువురు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జోగు బక్కన్న తన కుమారుడు జోగు మహేష్ శనివారం సాయంత్రం తమ ఇంటి దగ్గర గోడలకు నీళ్లు పట్టే సమయంలో సాయంత్రం ఏడు గంటలకు కరెంటు షాక్ తగిలి కింద పడిపోగా చికిత్స నిమిత్తం ఉమ్మడి జిల్లా మహబూబ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని తండ్రి బక్కన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేష్ తెలిపారు. అదేవిధంగా అమ్మడంబండ తాండకు చెందిన కే బాల్యా నాయక్ వయస్సు 26 సంవత్సరములు తన ఆటోను సంపులో మోటర్ ఆన్ చేసి కడుగుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కింద పడిపోయాడని మండల కేంద్రంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారని మృతుడి భార్య కేతావత్ జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### సగర సంఘం ఆధ్వర్యంలో

## నూతన ఎస్ఐకి ఘన సన్మానం

**కల్వకుర్తి,మే10 ప్రభాతవార్త:**కల్వకుర్తి నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కురుమూర్తి సగరను నాగర్‌కర్నూల్ జిల్లా సగర సంఘం అధ్యక్షులు గట్టుశ్రీను సాగర్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్ఐకి పుష్పగుచ్చం అందించి శాలువాలతో ఘన సన్మానించి మెమెంటోను బహుకరించారు. ఈసందర్భంగా జిల్లాఅధ్యక్షులు గట్టుశ్రీను మాట్లాడుతూ నూతనబాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతలు సేవలందించాలని కోరారు. సన్మానించిన వారిలో జిల్లా సగర ముఖ్య సలహాదారులు వావిలాల భీమయ్య సగర, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అయిన పడకంటి వివేకానంద సగర, జిల్లా ఆర్థిక కార్యదర్శి అయిన పడకంటి రాజు సగర, జిల్లా సగర యువజన అధ్యక్షులు రాకేష్ సగర, నాగర్‌కర్నూల్ పట్టణ ప్రధాన కార్యదర్శి అగు చిలుక రవి సగర, లింగంపల్లి సగర సంఘం కోశాధికారి చేగురి సాయిరాం సగర తదితరులు ఉన్నారు.


### బైకు ఆటో ఢీ కొని

## వ్యక్తికి తీవ్ర గాయాలు

**వీపనగండ్ల మే 10, ప్రభాతవార్త:** మండలంలోని కలవరాళ్ల పుల్గర్జర్ల మధ్య రోడ్డులో ఆటో బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా వనపర్తి ఏరియా హాస్పిటల్ కు 108 లో తరలించినట్లు తెలిసింది ఈ సంఘటన ఆదివారం సాయంకాలం జరిగింది. వివరాల్లోకి వెళ్తే పుల్కల్ జెర్ల గ్రామం నుంచి మామిడికాయలు తెంపడానికి పోయిన కూలీల ఆటో వీపనగండ్లకు సాయంకాలం సమీపంలో వస్తున్న సందర్భంలో కలవరాల నుండి పుల్గర్ జర్లకు సాకలి మధు అనే వ్యక్తి వయసు 30 సంవత్సరాలు ఇతను బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బైకుపై వెళుతూ మార్గమధ్యలో వస్తున్న ఆటోకు ఢీకొని అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోవడంతో దారిలో వెళ్తున్న ప్రయాణికులు 108 కు ఫోన్ చేసి తెలుపగా సాకలి మధును అందులో వనపర్తి ఏరియా హాస్పిటల్ కు తరలించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఇతను చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆటోలో వస్తున్న కూలీలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిసింది.

## పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్,మే 10,ప్రభాతవార్త :** దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం భూత్పూర్ మండలంలో జరిగిన పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.మండలంలోని చౌలతండాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాను నాయక్ కుమారుడు మల్లేష్ వివాహ రిసెప్షన్‌కు మాజీ ఎమ్మెల్యే ఆల హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.మండలంలోని హస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పోతుగుట్టతండాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మణ్‌నాయక్ మనుమరాలి వివాహానికి హాజరై నూతన వధూవరుల్ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే ఆల వెంట బీఆర్ఎస్ భూత్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు పార్టీ నాయకులు మొల్గర నర్సింహులుగౌడ్,రాము రాథోడ్,శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.


రిసెప్షన్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## ఘనంగా బీరప్ప బోనాలు..


బీరప్ప బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, మే 10 ప్రభాతవార్త:**కురుమల కులదైవమైన బీరప్ప స్వామి బోనాలు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా మహిళలు బోనమెత్తి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో ఒగ్గ కళాకారులు డోలు వాయిద్యాల నడుమ శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేవాలయంలో స్వామివారికి బోనాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుమ కులస్తులు పెద్ద కురుమ వెంకటయ్యకురుమ, నమ్ము మల్లేష్, జంగయ్య, చిదం కృష్ణయ్య, తంబాలు, రాములు, రామకృష్ణ, కృష్ణ, పర్వతాలు, బీరయ్య, కేంచ కుమార్, వినయ్, ధన్విత, భాస్కర్, లక్ష్మయ్య, బడక వెంకటయ్య, విక్రమ్, కార్వంగ వెంకటయ్య, శ్రీశైలం, శివ తదితరులు పాల్గొన్నారు.

### నేడు మొక్కజొన్న కొనుగోళ్లపై జిల్లా

## అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం

**వీపనగండ్ల మే 10, ప్రభాతవార్త;** ధాన్యం మొక్కజొన్న కొనుగోళ్లపై వనపర్తి జిల్లా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ పర్యాటకశాఖ అధికార ప్రతినిధి కల్వరాళ్ల నరసింహ తెలిపారు. ప్రస్తుత సీజన్లో రైతుల నుంచి ప్రభుత్వం వరి ధాన్యం మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను చేయడం జరుగుతుందని వాటిని వేగవంతం చేయడం క్షేత్రస్థాయిలో రైతులకు ఎదురవుతున్న సమస్యలు పై ఆయన అధికారులతో సమీక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## కల్వకుర్తి ఎస్ఐగా కురుమూర్తి

**కల్వకుర్తి, మే 10 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలో నూతన ఎస్ఐ కురుమూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఎస్ఐ మాధవరెడ్డి వంగూరుకు బదిలీ కాగా వెల్దండ మండలంలో ఎస్ఐగా విధులు నిర్వర్తించిన కురుమూర్తి కల్వకుర్తికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించబోమని, ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అమలు పరిచి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం అందుబాటులో ఉండి పనిచేస్తానన్నారు.



### రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న మండల సిపిఎం పార్టీ జిల్లా నాయకులు


రిసెప్షన్లో సిపిఎం పార్టీ నాయకులు

**వీపనగండ్ల మే 10, ప్రభాతవార్త ;** వీపనగండ్ల మండల కేంద్రంలో సిపిఎం పార్టీ నాయకులు కీర్తిశేషులు, కామ్రేడ్ ఈశ్వరయ్య కుమారుడు భాను ప్రకాష్ రిసెప్షన్ వేడుకలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.సిపిఎం వనపర్తి జిల్లాకార్యదర్శి, మండల సిపిఎం పార్టీ కార్యదర్శి బాల్ రెడ్డి, బొల్లారం గ్రామ మాజీ సర్పంచ్ మండ్ల కృష్ణయ్య,కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.మురళి, ఆశన్న, బాల గౌడ్, ఆది, నవీన్, నక్క అంజనేయులు, వెంకన్న గౌడ్, మాందాపురం నరసింహ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## రేపటి నుండి జనగణన

**విద్యా వారోత్సవాలు సందిగ్ధంలో ఉపాధ్యాయులు: టిఎస్‌టియు**

**మహబూబ్‌నగర్ మే 10 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణన కార్యక్రమం ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమై నెల రోజుల పాటు కొనసాగనుంది. దీనికోసం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరించడం ఈ ప్రక్రియలో అత్యంత కీలకం. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఖిప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుండి 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. టీచర్లకు ఏకకాలంలో రెండు పనులు చేయడం ఎలా సాధ్యం అవుతుంది. కాబట్టి విద్యాశాఖ ఉన్నతాధికారులు పునరాలోచించాలని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. జనగణన విధులకు ఆటంకం కలగకుండా విద్యా వారోత్సవాలను జూన్ నెలకు వాయిదా వేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి తాహెర్ ప్రభుత్వాన్ని కోరారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**మదనాపురం,మే 10 ప్రభాతవార్త :** దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి మండల పరిధిలోని రామన్ పాడ్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ రాములు కూతురు వివాహ రిషప్షన్ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించి వారి వైవాహిక జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివాహ వేడుకలకు హాజరైన కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రజలతో ఆత్మీయంగా మమేకమవుతూ మాజీ ఎమ్మెల్యే అందరితో కాసేపు మాట్లాడారు.ఆయన వెంట మాజీ జడ్పీటీసీ కృష్ణయ్య,మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, నాయకులు చెన్నకేశవ రెడ్డి, యాదగిరి, చాంద్ పాషా, ప్రవీణ్ రెడ్డి,మనోజ్‌కుమార్,రాజు కుమార్, రాములు గౌడ్, నాగరాజు, వెంకట్ స్వామి, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తుల ఐక్యత గ్రామదేవతల పండగలతోనే.

◆ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



గ్రామస్తులతో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మే10, ప్రభాతవార్త:** ఎనలేని నమ్మకంతో నిర్వహించే గ్రామదేవతల పండుగలతో గ్రామస్తుల మధ్య ఐక్యత పెంపొందిస్తాయని పర్యాటక సాంస్కృతిక ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ఆదివారం వనపర్తి జిల్లా గ్రంధాలయాల అధ్యక్షులు గోవర్ధన్ సాగర్ ఆహ్వానం మేరకు పాన్గల్ మండలం మందాపురం గ్రామంలో నిర్వహించిన నాభిశిల పున ప్రతిష్ట కార్యక్రమానికి వారు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల కార్యక్రమాన్ని వారుప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బండలాగుడు పోటీలకు ఒక ప్రత్యేకత ఉంటుందని,ఈ పోటీల్లో పోటీపడే వృషభరాజులను ప్రత్యేక శ్రద్ధతో పెంచుతారని, రైతులు మాత్రమే ఇలాంటి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు,మహిళలు, యువకులు ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తెద్దాం

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దాలని ప్రజలు భావిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. మోడీని చూసేందుకు తరలివచ్చినజనంతో హైదరాబాద్ పట్టణాలు జన సంద్రంగా మారాయని ఎంపీపేర్కొన్నారు. నెక్స్ట్‌టార్గెట్ తెలంగాణ విజయం అని, అందుకు ప్రతి ఒక్క కార్యకర్త,నాయకుడు క్షేత్రస్థాయిలో కృషిచేసి బిజెపిని తెలంగాణలో అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

# జడ్చర్లలో పంట కొనే నాధుడే లేడు..

◆ రైతులపై ప్రభుత్వానికి ధ్యాస లేదా

◆ పంట దిగుమతి చేసుకోవడానికి కూడా జాగా లేదు

◆ సమస్యలు వదిలేసి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పై విమర్శలు చేయడం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి తగదు

◆ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కోడుగల్ యాదయ్య, బిఆర్ఎస్ నాయకులు

**జడ్చర్ల, మే10 ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టించి పంటలు పండించిన రైతులను ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురి చేసిందని, నేడు పంటలు కొనే నాథుడే లేదని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. జడ్చర్ల లోని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనక పోవడం కనీసం నిల్వ చేసుకోవడానికి కూడా జాగా లేకపోవడంతో సుమారు 35ట్రాక్టర్లకు పైగాధాన్యాన్ని తిరిగి మార్కెట్ యార్డుకు పంపడంతో ఆగ్రహించిన రైతులు శనివారం పత్తి మార్కెట్ ఎదురుగా జాతీయ రహదారిపై ట్రాక్టర్లతో ఆందోళనకు దిగారని విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జడ్చర్ల పర్యటనకు విచ్చేసిన సందర్భంగా రైతుల వద్దకు చేరుకొని అధికారులను పిలిపించి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని సూచించడంతో సమస్య సర్దుమనిందని, అది జీర్ణించుకోలకే ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాజీ మంత్రిలక్ష్మారెడ్డిపై ఇష్టారీతిగా మాట్లాడడం తగదని,ఒక ఎమ్మెల్యేగా ఇలాంటి మాటలు మాట్లాడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యేగా నియోజకవర్గ సమస్యలపై దృష్టి సారించాల్సింది పోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే కనీసం పండించిన పంటను అమ్ముకోవడానికి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడానికి కూడా జాగా లేక ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకుండా తనకు ఇష్టం ఉన్నట్లుఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడడం సమంజసం కాదని విమర్శించారు.మాజీ మంత్రి సూచన మేరకు పంటను గోదాముల్లో దిగుమతి చేసుకోవడంతో జడ్చర్ల మార్కెట్ సెక్రటరీ పై కక్షపూరితంగానే వేటు వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. లక్ష్మారెడ్డి కి పేరు వస్తుందనే దురుద్దేశంతోనేఈ నిర్ణయానికి పాల్పడినట్లు ఆరోపించారు. కోటి 74 లక్షలతో నిర్మించిన గోదాంలో జడ్చర్ల రైతులకు ఉపయోగపడకుండా నాగర్‌కర్నూల్ జిల్లారైతులకు సంబంధించిన ధాన్యాన్ని నిల్వ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జడ్చర్ల కు ఫ్యాక్టరీలు రావాలని యువతకు ఉపాధి దొరకాలని స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరకాలని లక్ష్యంతో గత ప్రభుత్వం ఫ్యాక్టరీలను కంపెనీలను తీసుకొస్తే, కనీసం అవగాహన లేకుండా ఫ్యాక్టరీని తగలబెడతా అనిమాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ఎమ్మెల్యేగా ఇది నీకు తగునా అని బి ఆర్ ఎస్ నాయకుడు నాగిరెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు.ఇక మీదట ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పై తనకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు నందకిషోర్‌గౌడ్, చైతన్య, బుక్కా మహేష్, లత, నాయకులు పిట్టల మురళి,భూపతిరెడ్డి, ఇమ్ము, కొండల్, పర్వత్ రెడ్డి, కరాటే శీను తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు



**మక్తల్ టౌన్, మే 10 ప్రభాతవార్త:** ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న నేపథ్యంలో, కొంతమంది యువత తక్కువ సమయంలో, సులువుగా డబ్బులు సంపాదించాలని ఆశించి క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నారని మక్తల్ సీఐ రామ్‌లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా నష్టపోయి, జీవితాలు నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర నిరాశకు గురై తీవ్రమైన నిర్ణయాలకు దారి తీసే ప్రమాదంకూడా ఉందని,దీంతో కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు.క్రికెట్ బెట్టింగ్స్ చట్టరీత్యా నేరమని, ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. అలాగే బెట్టింగ్ నిర్వహించేవ్యక్తులపై ప్రత్యేకనిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ఈ మాయలో పడకుండా జాగ్రత్తపడాలని, తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని సీఐ సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై నిఘాఉంచి, వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు. మ్యాచ్‌ల సమయంలో పిల్లల్లో ఏవైనా అనుమానాస్పద మార్పులు గమనిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.క్రికెట్ వంటి ఆటలను వినోదంగా మాత్రమే చూడాలని, వాటిని బెట్టింగ్‌ల కోసం ఉపయోగించకూడదని అన్నారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# కాలుష్య కోరల్లో అన్నదాతలు..



◆ శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు పంటలు నాశనం

◆ కంపెనీపై పొల్యూషన్ కంట్రోల్ అధికారుల చర్యలేవి..?



పంట పొలాలు దగ్గరగా కంపెనీ



కంపెనీ నుండి వెదజల్లుతున్న కాలుష్యం

**జడ్చర్ల, మే 10, ప్రభాతవార్త:** విర్కో పెట్రో కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పెద్దపల్లి నుండి విడుదల అవుతున్న వాయు కాలుష్యం తాము తీవ్ర శ్వాస కోస సంబంధిత వ్యాధులతో పాటు ఊపిరి తీసుకోడానికి కూడా వీలుకాని దుర్వాసనతో అల్లాడుతున్నామని ఈ కంపెనీ వెదజల్లుతున్న కాలుష్యంపై అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఇప్పటికైనా తమను వాయు కాలుష్యం నుండి కాపాడాలని లేదంటే తమకు మరణమే శరణ్యమని జడ్చర్ల మండల పరిధిలోని వల్లూరు గ్రామపంచాయతీ లోని చిన్న గుట్టతండా రైతులు దేవుజా, దాస్య తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పోలేపల్లి శివారులోని 642, 644 సర్వే నెంబర్లు 5 ఎకరాల భూమి దేవుజాలకు ఉందని వీరి భూమి చుట్టూ విర్కో కంపెనీ ఏర్పాటు అయిందని అప్పటినుండి ఈ కంపెనీ తీవ్రమైన వాయు కాలుష్యంతో పాటు కాలుష్య జలాలను తమ పొలంలోకి వదులుతుందని దీంతో తమ వ్యవసాయ పొలంలో ఏ పని చేయలేక పోతున్నామని కనీసం నిలబడి శ్వాస కూడా తీసుకునే పరిస్థితి లేదని ఈ వాయు కాలుష్యం తమ పంట పొలాల వరకే పరిమితం కాకుండా తమ గిరిజన తండాలోకి కూడా ప్రవేశించి తీవ్రమైన దుర్వాసనతో తండలోని అనేక మంది ప్రజలు తీవ్ర అనారోగ్య బారిన పడుతున్నారని ఈ కాలుష్యం ప్రభావం జడ్చర్ల మున్సిపాలిటీలోని హౌసింగ్ బోర్డ్ వరకు ఉంటుందని రైతులు తెలిపారు. ఇవాళ వాయు కాలుష్యం, జల కాలుష్యంతో తమ వ్యవసాయ పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం కూలీలను తీసుకువచ్చిన ఒక అరగంట కూడా పనిచేయలేక వెళ్ళిపోతున్నారని దీంతో తాము వ్యవసాయం చేయలేకపోతున్నామని తమకున్న 5 ఎకరాల వ్యవసాయ భూమిని విర్కో కంపెనీ వారు తమకు అమ్మాలని ఒత్తిడి తెస్తున్నారని ఇదివరకే తమకు ఉన్న పది ఎకరాల వ్యవసాయ భూమి ఉదండాపూర్ డ్యామ్‌లో పోయిందని ప్రస్తుతం ఈ భూమిని నమ్ముకుని తాము జీవనం కొనసాగిస్తున్నామని ఇప్పుడు కంపెనీ యజమాన్యం కన్ను తమ భూమిపై పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాణాలు పోయినా సరే ఆ భూమిని కంపెనీకి ఇచ్చేది లేదని కంపెనీ ద్వారా విడుదలవుతున్న వాయు, జల కాలుష్య నివారణకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో తాము ఇటు వ్యవసాయ పనులు చేయలేక జీవన్మరణ పోరాటం చేయాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడిందని ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అష్టకష్టాలు

■ సన్న వడ్లకే మొగ్గు చూపుతున్న మిల్లర్లు

■ ఇద్దరు రైతులు కలిసి తెచ్చిన వడ్ల లారీలను కాంటా చేయించని కాంట్రాక్టర్

■ ఇద్దరు రైతుల వడ్లను ఒకే రైతు వడ్ల లాగ తూకం..

■ ఎవరికైనా చెప్పుకోండి నేనింతే.. అని రైతులను బెదిరిస్తున్న లారీల కాంట్రాక్టర్



కొనుగోలు కేంద్రం వద్ద లారీలలో లోడ్ చేస్తున్న దృశ్యం

**నర్వ, మే 10 ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించి వరి సాగు చేసిన రైతన్నల పరిస్థితి దయనీయంగా మారింది.అమ్మ బోతే అడవి...కొనబోతే కొరివి అన్న చందంగా ఎన్నో ఒడిదుడు కులను ఎదురీది పండించిన పంటను అమ్ముకుందామంటే పరిస్థి తులు సహకరించడం లేదు.ఒక కిలో ఎక్కువ తూకం వేస్తేగానీ కొనేందుకు ససేమిరా అంటున్న మిల్లర్లు. అదనం గా డబ్బులు చెల్లిస్తేగానీ లారీల్లో ధాన్యం దించమని, షరతులు విధిస్తుండటంతో రైతులపరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది.అలవిగాని షరతులతో అసలు ధాన్యాన్ని ప్రభుత్వానికే విక్రయించాలా...? లేదా ప్రైవేటు మార్కెట్‌ను ఆశ్రయించి చేతికి అందింది పుచ్చుకోవాలా...? అన్న మీమాంసలో రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు పండించిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం ద్వారా ఇబ్బందులు లేకుండా చేస్తామని ప్ర భుత్వాలు చెబుతున్నాయి కానీ ఆచరణలో మాత్రం చేసి చూపకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు,లారీ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అడిగేవారు కరువయ్యారు. ప్రభుత్వము సన్న రకం వడ్లతో పాటు,దొడ్డు రకం వడ్లను కూడా చేయాలని ఆదేశించినప్పటికీ కూడా కొందరు మిల్లర్లు సన్నవడ్లకు మాత్రమే ఎక్కువగా ముగ్గు చూపుతున్నారు. దొడ్డు రకం వడ్లకు ఎక్కువగా ముగ్గు చూపడం లేదు.శనివారం,ఆదివారం రోజు మరికల్ లోని వెంకట సాయి ఇండస్ట్రీస్ (రైస్ మిల్)కు సన్న రకం వడ్లతో పాటు దొడ్డు రకము వడ్లను రైతులు తీసుకురావడం జరిగింది. ఇక్కడ సన్న రకం వడ్లకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారనీ,సన్న వడ్లను 10 బండ్ల ను ఖాళీ చేస్తున్న,దొడ్డు రకం వడ్లను ఒక్క బండి కూడా ఖాళీ చేయడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు.చిన్న సన్న కారు రైతులు తక్కువ తక్కువ వడ్లు ఉన్న వారు ఇద్దరు కలిసి ఒక లారీకి వడ్లను లోడ్ చేసుకొని రైస్ మిల్లుకు తీసుకురాగా ఒకేసారి కాంటాక్ట్ చేసి అన్ని వడ్లను ఒకే రైతుపై రాసి ఇస్తామని,ఇద్దరు రైతులకు రెండుసార్లు కాంటాక్ట్ చేయమని హెచ్చరిస్తూ ఒకే రైతుపై ఇరువురి వడ్లను తూకం వేయించిపంపుతున్నారు. ఇలా అయితే ఇద్దరు రైతులను ఎలా వేసుకోవాలి అని అడిగిన పట్టించుకోకుండా లారీనిఅన్లోడ్ చేయించి పంపించడం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ చందు తన నుండి పంపించిన లారీలో ఇద్దరు రైతులు కలిసి వారియొక్క వరి ధాన్యాన్ని రైస్ మిల్లుకు తీసుకువచ్చారు.ఒక రైతువి కొన్ని బస్తాలు, ఇంకో రైతువి కొన్ని బస్తాలను కలిపి లారీలో మొత్తము ధాన్యాన్ని అమ్మటానికి మిల్లుకు తీసుకువచ్చారు.మిల్లు వద్ద మొదట కాంటా చేసి ఒక రైతుకు సంబంధించిన వడ్లను దించడము జరిగింది.తర్వాత ఇంకో రైతుకు సంబంధించిన వడ్ల బస్తాలను తూకం వేయించి దింపాల్సి ఉంటుంది.కానీ ఇంకో రైతుకు సంబంధించిన వడ్ల బస్తాలను లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ చందు కాంట చేయించకుండా అదే రైతు పేరిట దింపడం జరిగిందనీ రైతులు ఆవేధన చెందుతున్నారు.సదరు రైతులు అన్నా కాంట వేయకుండా ఇలా చేస్తే మేము ఎలా లెక్కించుకొని బిల్లు చేయించుకోవాలి అని అడిగి బతిమిలాడిన కూడా వినకుండా రెండుసార్లు నేను కాంటాను చేయను ఒకేసారి చేస్తాను అని దబాయించడం జరిగిందని రైతులు తెలిపారు.వడ్లు తక్కువగా ఉండడంతో లారీ లో ఇద్దరు రైతులు కలిపి వడ్లను తీసుకు వచ్చామని వివరించిన వినకుండా నేను రెండి సార్లు తూకం చేయించను ఎవరికైనా చెప్పుకోండి నేనింతే అని నిరక్ష్యంగా సమాధానమిస్తూ రైతులపై విరుచుకుపడ్డాడు.ఎంత బతిమిలాడిన వినకుండా ఒకే రైతుపై వడ్లను కాంటా చేయించి అన్లోడ్ చేయించాడు. జిల్లాలో నాకు అందరూ తెలుసు మీరు ఎవరికైనా,ఏ అధికారికైనా డీఎస్ఓ కు అయిన,కలెక్టర్ కైనా చెప్పుకోండి నేనింతే అని బెదిరించి లారీని దగ్గరుండి అన్లోడ్ చేయించాడని రైతు ఆంజనేయులు తెలిపారు.ఈ విషయంపై నర్వసొసైటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి,సీఈఓ ఉదయ్ కుమార్ కు,కొనుగోలు కేంద్రం ఇన్చార్జి సునీల్ కు తెలిపి విషయము క్లుప్తంగా వివరించిన కూడా లాభం లేకుండా పోయిందని రైతులు వాపోయారు.ఈ తతంగంపై సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు దృష్టిసారించడం ద్వారా అక్రమ వసూళ్లను అరికట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

**రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు : జి.అంజి రైతు, రాయికోడ్**



వడ్లను అమ్ముకునేందుకు రైస్ మిల్లుకు తీసుకు పోవడానికి సమయానికి లారీలను పంపకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌లు సమయానికి లారీలను పంపక పోవడంతో పాటు, పంపిన ఒక్క లారీరో ఇద్దరు కలిసి తెచ్చిన వడ్లను వేరువేరుగా కాంటా చేయించకుండ ఒకే రైతు పేరు పైన వడ్లు తూకం వేయించి లారీని అన్లోడ్ చేయిస్తున్నారు. దీంతో ఎలా లెక్క చేసుకోవాలని అడిగిన పట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతున్నారు.

## అతివలకు అండ..

# వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి కుట్టు మిషన్

■ మగ్గం వర్క్ పై శిక్షణ

■ తమ సొంత కాళ్ళపై నిలబడుతున్న మహిళలు

■ గార్లపహాడ్‌లో శిక్షణ పొందిన 60 మంది



మగ్గం వర్క్‌లో శిక్షణ పొందిన మహిళలు

**మహబూబ్‌నగర్, మే 10, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతంలోని మహిళలకు వందేమాతరం ఫౌండేషన్ అండగా నిలుస్తున్నది. ఉపాధి అవకాశాలు లేక వ్యవసాయ కూలీలుగా మారుతున్న వారికి తమ సొంత కాళ్లపై నిలబడి స్వసక్తితో ఎదిగేందుకు అవకాశం కల్పిస్తున్నది. కుట్టు మిషన్ మగ్గం వర్క్ పై రెండు నెలల పాటు శిక్షణ అందిస్తూ అతివలు ఆర్థికంగా నిలబడేందుకు భరోసా కల్పిస్తున్నది.మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని గార్ల పహాడ్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డి తన సొంత ఇంటిని శిక్షణ కేంద్రంగా మార్చి గ్రామంలోని నిరుపేద మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు కృషి చేస్తున్నారు. అందుకు వందేమాతరం ఫౌండేషన్ సహకారం తీసుకొని గార్లపాడును మగ్గం పనులకు కేరాఫ్‌గా చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. 3000 జనాభా ఉన్న గ్రామంలో సుమారు 1500కు పైగా మహిళలు ఉన్నారు. అయితే గ్రామీణ వాతావరణంలో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎలాంటి అవకాశాలు లేకపోవడంతో ఇంటివద్దె గృహిణులుగా మిగిలిపోతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రం ఉండడంతో బయటకు వెళ్లి పనులు చేసుకోలేక ఇటు ఇంటి వద్ద ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి రవీందర్ రెడ్డి అండగా నిలుస్తూ తన స్వగ్రామంలోని సొంత ఇంటిని శిక్షణ కేంద్రంగా మార్చి సుమారు 60 మంది మహిళలకుమగ్గం వర్క్ పై వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కల్పించారు. ఇప్పటికే ఒక బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకోవడంతో చాలామంది తాము ఆర్థికంగా స్వశక్తితో తమ సొంత కాళ్లపై నిలబడి తమ సత్తాను నిరూపించుకుంటున్నారు. ఇక్కడే శిక్షణ పొందిన మహిళలు శిరీష గ్రూప్ ఆఫ్ టైలరింగ్ పేరుతో సుమారు పదిమంది ఒక సెంటర్‌ను ఏర్పాటు చేసుకుని అన్ని రకాల కుట్లు అల్లికలకు సంబంధించి ఆర్డర్లు తీసుకొని ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. ఒక బ్లౌజ్ కుట్టడానికి రూపాయలు 100, కస్టమర్ల ఆసక్తిని బట్టి 500 నుంచి 5000 వరకు మగ్గం వర్క్ కు సంబంధించి అత్యాధునిక టెక్నాలజీతో ఎంబ్రాయిడరీ వర్క్ మిషన్ తో పనులు చేస్తున్నారు. తమ ఖర్చులు అన్ని పోను ఒక్కొక్క మహిళా సుమారు 15 వేల వరకు ప్రతినెల తాము పొందుతున్నట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మహిళలు రవీందర్ రెడ్డికి, వందేమాతరం ఫౌండేషన్ సభ్యులకు నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నారు.

**నెలకు పదివేలకు పైగా సంపాదిస్తున్నాం : అనిత, గార్లపహాడ్**



నా పేరు అనిత నాది స్వగ్రామం గార్లపహాడ్. నేను వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణ కేంద్రంలో కుట్లు అల్లికలు మగ్గం వర్క్ నేర్చుకొని స్వగ్రామంలోనే ఉపాధి పొందుతున్నాను. రవీందర్‌రెడ్డి సార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు.

**సొంత కాళ్లపై నిలబడుతున్నాం : శిరీష, గార్లపహాడ్**



రవీందర్ రెడ్డి సార్ వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో నేను దాదాపు 60 రోజులపాటు మగ్గం వర్క్ పై తర్ఫీదు పొందాను. కొంత లోన్ తీసుకొని సొంత డబ్బులతో మా గ్రామంలోనే షాప్ ఓపెన్ చేసాము.ఇప్పుడు మా దగ్గర సుమారు అయిదారు మంది ఉపాధి పొందుతున్నారు. మాకు అన్ని ఖర్చులు పోను 20వేలకు పైగా మిగులుతున్నాయి.

## ఎమ్మెల్యే గారు గజినిలా ప్రవర్తించకండి : బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్



మాట్లాడుతున్న టిఆర్ఎస్ నాయకులు

**రాజాపూర్, మే 10 ప్రభాతవార్త:** జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతూ గజినిలా ప్రవర్తిస్తున్నారని రాజాపూర్ మండల భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు మేకల శ్రీశైలం యాదవ్ పలువురు టిఆర్ఎస్ నాయకులు రాజాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పై మండిపడ్డారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తే మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరికాదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నర్సింలు, మాజీ సర్పంచ్ కప్పెరి బచ్చిరెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### మైనింగ్ అధికారుల అలసత్వంతో

# పెట్రేగిపోతున్న మైనింగ్ మాఫియా

**అనుమతులు లేకుండా అక్రమ బ్లాస్టింగ్?**

**అయ్యవారి పల్లి శివారులో జోరుగా సాగుతున్న అక్రమ మైనింగ్**



డిండి శివార్‌లో డంపింగ్ చేసిన మెటీరియల్

**ఉప్పునుంతల, మే 10 ప్రభాతవార్త :** మండలంలో ని అయ్యవారిపల్లి, వెల్టూరు గ్రామ శివారు లలో మైనింగ్ అధికారుల అలసత్వంతో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మైనింగ్ మాఫియా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారు. తవ్వకాలలో వెలిసిన పలుగు రాయిని నల్గొండ జిల్లా డిండి గ్రామంలో డంపింగ్ చేస్తున్నారు. ఈ పనుల్లో రాయల్టీ లేదు, బ్లాస్టింగ్ అనుమతులు, పొలం లీజు లేకుండా బ్లాస్టింగ్ పనులు కొనసాగిస్తున్నారు. బ్లాస్టింగ్ నిర్వహించే మాఫియాకు మండల స్థాయి అధికారులు, కొంతమంది ప్రజా ప్రతినిధులు అండదండలు ఉన్నాయని తనను ఎవ్వరు ఏం చేయలేరని అహంకార భావంతో సమాధానాలు చెప్తున్నారు. మండల కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉండడం ఇతరత్రా వ్యవసాయ పొలాలు ఉండడంతో ఇదే అదునుగా భావించి రంగారెడ్డి జిల్లాకు చెందిన కొంతమంది మైనింగ్ మాఫియా జిల్లా మైనింగ్ అధికారుల అలసత్వంతో భారీ ఎత్తున అక్రమ బ్లాస్టింగ్ లు నిర్వహిస్తున్నారు. మైనింగ్ పనులు అయ్య వారి పల్లి శివారు ప్రాంతాల్లో సర్వే నెంబర్ 14 లో నిర్వహిస్తున్న ఈ ప్రాంతంలో షెల్టర్ ఏర్పాటు కోసం రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. ఒకటి వేళలో పనులు నిర్వహిస్తే అందరి చూపు తమపైపే ఉంటుందని భావించి రాత్రి వేళల్లో బ్లాస్టింగ్ నిర్వహించి అప్పటికప్పుడు బ్లాస్టింగ్ చేసిన మెటీరియల్ నల్గొండ జిల్లా డిండి ప్రాంతంలో డంపింగ్ చేస్తున్నారు. అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పగలంతా మైనింగ్ ప్రాంతంలో ఏమి కనిపియదు, సాయంత్రం7 గంటల తర్వాత పనులు ప్రారంభిస్తున్నారు. జిల్లా మైనింగ్ అధికారులు సత్వరమే విచారణ జరిపి ఈ అక్రమ బ్లాస్టింగ్ పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అకాల వర్షంతో తడిసిన ధాన్యం

**రేవల్లి,మే 10 ప్రభాతవార్త:** రేవల్లి మండలం గౌరిదేపల్లి గ్రామంలో కురిసిన అకాల వర్షంతో వరి ధాన్యం తడిసి నష్టపోయింది. సమయానికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

